మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
నవతెలంగాణ 1
సోమవారం 17 జులై 2023



బయట కూలీలా పనులు అడ్డగింత

నవతెలంగాణ-నంగునూరు

గ్రామ పంచాయతీ కార్మికులు పదకొండు రోజులు నుండి సమ్మె చేస్తున్న కారణంగా వేరే ప్రాంతాల నుంచి కూలీలను పనుల్లోకి తీసుకరావడంతో జీపీ కార్మికులు వారిని అడ్డగించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె పదకొండో రోజుకు చేరుకుంది. నంగునూరు మండల కేంద్రంలో వేరే ప్రాంతాల్లో నుంచి కూలీలను తీసుకవచ్చి పనులు చేస్తుండగా జీపీ కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నాయకురాలు దేవులపల్లి బాల్ నర్సవ్వ మాట్లాడుతూ ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దేవులపల్లి రాజమౌళి, మండల నాయకులు దేవులపల్లి మల్లయ్య, మండలంలోని జీపీ కార్మికులు పాల్గొన్నారు.

24న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా



నవతెలంగాణ-మద్దూరు

చేర్యాలను రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 24న జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ దూల్మిట్ట జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం జేఏసీ నియోజకవర్గ నాయకులు గద్దల మహేందర్ మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ ప్రాంతం అస్తవ్యస్తంగా విడదీయబడి పాలకుల పాచికలో బంధించబడిందని, గత కొంతకాలం నుండి అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పటికీ, చలనం లేని పాలకులు ఉన్నారని, ప్రజల కోరికను, వారి ఆకాంక్షను గుర్తించి నియోజకవర్గాన్ని నెరవేర్చడంలో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతం అస్తిత్వం, అభివృద్ధి ఆత్మగౌరవంతో నిలబడాలంటే ప్రజలంతా ఒకటి కావాలని కోరారు. పాలకులను ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. ఉద్యమ కార్యచరణలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నా కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బండి చంద్రయ్య కో, కన్వీనర్ సుందరగిరి భాస్కర్,చంద్రం, రమేష్ యూత్ సభ్యులు కొండూరి నవీన్, వెంకట్, స్వామి, రాజు నరేష్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో దొంగతనం



నవతెలంగాణ-నంగునూరు

సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు సెంటిమెంట్ దేవాలయమైన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర దేవాలయంలో గుర్తు తెలియని దొంగలు గర్భ గుడిలో హుండీని ఎత్తుకెళ్లారు. రాజగోపాల్ పేట ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కోనాయిపల్లి వెంకటేశ్వర ఆలయంలోకి శనివారం రాత్రి గర్భగుడి ముందు ఉన్న హుండీని దొంగలించారు. హుండీ తాళాలు పగలు కొట్టి దాంట్లో ఉన్న దాదాపు రూ.25 వేలు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మ విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

10 కేరన్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే 10కే రన్ కార్యక్ర మాన్ని విజయవంతం చేయా లని హుస్నాబాద్ సిఐ ఎర్రల్ల కిరణ్ తెలిపారు. ఆదివారం 10 కే రన్ ఏర్పాట్లను హుస్నాబాద్ ఎస్సై మహేష్, అక్కన్నపేట ఎస్సై వివేక్ తో కలిసి పరిశీలించారు. సోమవారం ఉదయం 6 గంటలకు హుస్నాబాద్ ఏనే వద్ద 10 కే రన్ ప్రారంభమై జనగామ స్టేజి వరకు వెళ్లి తిరిగి హుస్నాబాద్ ఏనే వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమనికి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్, సిద్దిపేట సిపి శ్వేతా రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.10%ఖ% రన్ లో రాణించిన విజేతలకు ప్రథమ, ద్వితీయ నగదు బహుమతులు మహిళలకు,పురుషులకు వేరువేరుగా అందజేస్తామన్నారు.10 కే రన్ కార్యక్రమాన్ని రన్నర్స్ ఉత్సాహవంతులు విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి అదేశాలపై ఆర్ఎంపీ, పీఎంపీల హర్షం

నవతెలంగాణ-బెజ్జంకి

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఎండ్లుగా ప్రథమ చికిత్స సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలను ప్రభుత్వం గుర్తించి శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందజేయాలని రాష్ట్ర ఆర్థిక,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఆదివారం మండల ఆర్ఎంపీ,పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన శిక్షణ అందించేల ప్రత్యేక చోరవ చూపి ఆర్ఎంపీ,పీఎంపీల కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.శిక్షణపై అదేశాలు జారీ చేసిన మంత్రి హరీశ్ రావుకు మండలాధ్యక్షుడు తాళ్లపల్లి స్వామి,జిల్లా ఉపాధ్యక్షుడు జానకి రాములు,సంజీవ్,మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ అభివృద్ధిని జీర్ణించుకొని కాంగ్రెస్



నవతెలంగాణ -గజ్వేల్

తెలంగాణ అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోవడంలేదని తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం సీఎం మిని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్కు బిజెపి చెయ్యి కలిపిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి రోల్ మోడల్ గా మారిందన్నారు. బిజెపి నాయకులు ప్రజలు మోసం చేస్తున్నారని ఆయన్నారు. కరెంటు మూడు గంటలు సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉత్తంకుమార్ రెడ్డి బట్టి విక్రమ్ లాంటివారు తెలంగాణలో ఆత్మహత్య లేవని చెప్తున్నారన్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాత్రం మూడు గంటల సరిపోతుందని చెప్పడం సిగ్గుచేటు అన్నారు.

చేర్యాల సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో 10కే రన్



నవ తెలంగాణ-మద్దూరు

ఆగస్టు 6న సిద్దిపేట పట్టణం రంగనాయక్ సాగర్ ప్రాజెక్టుపై హాఫ్ మారథాన్ రన్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రమోషన్ రన్‌ను ఆదివారం ఉదయం 5:30 గంటలకు చేర్యాల సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ముస్త్యాల చౌరస్తా రోడ్ నుండి మద్దూరు గ్రామం వరకు 10కె రన్ నిర్వహించినట్లు చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10కె రన్‌లో చేర్యాల, మద్దూరు, కొమరవెల్లి మండలాలకు చెందిన యువతి, యువకులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసినట్లు తెలిపారు, పురుషులలో ముగ్గురికి, స్త్రీలలో ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రూ.6 వేలు మద్దూరు వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం అందించినట్లు తెలిపారు. గాగిలాపూర్ గ్రామానికి చెందిన యువకులు హాఫ్ మారథాన్ రన్ దరఖాస్తు కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ రూ.5 వేలతో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు చేర్యాల ఎస్సైలు నారాయణ గౌడ్, భాస్కర్ రెడ్డి, సర్పంచులు పెడతాల ఎల్లారెడ్డి, జనార్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు

సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సెప్టెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజ్ తెలిపారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన సంగారెడ్డి పట్టణంలోని ఆంథోని డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సమావేశలు సెప్టెంబర్ 8నుండి10 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్లీనరీ సమావేశలకు 1000 మంది నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారున్నారు. ఈ సమావేశాలో గత కార్యక్రమాలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ను రూపొందిస్తారన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం ఆనాటి నుండి నేటి వరకు విద్యారంగ సమస్యనుపై అమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. విద్యా వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ మిశ్రిన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య, న్యాయవాది ఐలు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ పాల్గొన్నారు.

ఆకలేస్తే అగడవ్..వెతుకులాటే శరణ్యం

- బతుకు వేటలో బలికాక తప్పని పరిస్థితి
- విద్యుత్‌ఘాతంతో మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- కాలం చెల్లిన తీగలు
- కానరాని విద్యుత్ శాఖ అధికారులు
- ఆధారం కోల్పోయి అల్లాడుతున్న పశు పోషకులు
- బాధిత రైతులకు నేటికీ అందని నష్టపరిహారం



నవతెలంగాణ- కొల్చారం

వెసవిలో ఇంటివద్ద పశువులకు గ్రాసం కొరత.. పంట పొలాలు లేకపోవడంతో అడవికి వదిలేస్తుంటారు. బీడు భూముల్లో పాములు, విద్యుత్ తీగలు కన్పించవు. బతుకు పోరాటంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అయినా పొలాల్లో గాలించి గడ్డి సంపాదించుకోవాలి. ఈ క్రమంలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశుపోషకులకు ఆర్థికంగా నష్టం, కష్టం కలుగుతుంది. మండలంలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మూగజీవాలు మృతి చెందుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల వద్ద కంచెలు లేకపోవడం సక్రమంగా లేని తీగలు, తెగిపడుతున్న విద్యుత్ లైన్లు పశువుల పాలిట యమపాశాలవుతున్నాయి. కాలం చెల్లిన తీగలను మార్చాల్సిన విద్యుత్ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడికక్కడ తెగిపడుతున్నాయి. కొల్చారం మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో భాగంగా ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. విద్యుత్ అధికారులు మాత్రం స్పందించడం లేదని విద్యుత్ బకాయిలు వసూలు చేసేటప్పుడు మాత్రమే అధికారులు కనిపిస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారం కోసం ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022- 2023 సంవత్సరానికి సంబంధించి దాదాపు 40 మూగజీవాలు మృత్యువాత పడ్డ సందర్భాలున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల్లో మాత్రం చలనం పుట్టుకు రావడం లేదు. ఇటీవల మే నెలలో చోటు చేసుకున్న ఘటన అంసానిపల్లి గ్రామానికి చెందిన గొల్ల అశోక్, వరిగుంతం గ్రామ పంచాయతీ పరిధి కుడి చెరువు తండాకు చెందిన లంబాడి పొన్య రైతుల పాడిగేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. అంతేకాకుండా పైతర గ్రామానికి చెందిన కుసంగి భిక్షపతి, తుమ్మలపల్లి తండాకు చెందిన రామావత్ శాంతి అనే గిరిజన మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గతంలో కోనాపూర్ గ్రామానికి చెందిన ఊరడి కిషన్‌కు చెందిన మూడు పాడి గేదెలు మాందాపూర్ గ్రామ శివారులో తెగిపడిపోయిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదాలన్నీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ లోపాలు, తెగిపడుతున్న తీగలతో ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాలకు కారణాలు ఇవీ..

విద్యుత్ లైన్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుంది. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లలో అత్యధికంగా ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి కంచెలు అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో చిన్నపాటి గాలులకు ఇవి తెగబడి పశువుల ప్రాణాలను హరిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రిటర్న్ సప్లై రావడం, తీగలకు వివిధ రకాల పిచ్చిచెట్లు అల్లుకొని ఉండటంతో ఎర్తింగ్ తీగలకు విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటు సమయంలో నిర్దేశించిన లోతులో గుంతలు తీయడం లేదు. దీంతో స్తంభాల తయారీలోనూ నాణ్యత లోపిస్తుంది. దీంతో ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విరిగిపోవడం జరుగుతున్నాయి.

పేరుకే పంచనామాలు

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువులకు సంబంధించిన అధికారులు పంచనామాలు మాత్రం చేసుకుని వెళ్తున్నారే తప్ప నేటికి కూడా ఏఒక్క బాధితునికి నష్టపరిహారం అందించిన ధాఖలాలు లేవు. ఇదేంటని అడిగితే మాకు సంబంధం లేదు. పశువైద్యాధికారిదే బాధ్యత అని తప్పించుకుని తిరుగుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బాధిత రైతులు పశువుల వివరాలతో కూడిన ధ్రువపత్రాలను విద్యుత్ శాఖ అధికారులకు అందించినప్పటికీ కూడా ఆర్థిక సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం అందే విధంగా చూస్తాం



విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పశువులకు సంబంధించిన బాధిత రైతులకు పంచనామా రిపోర్టులను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపించాం. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తాం.

– మండల ట్రాన్స్కో ఏఈ హమ్మద్ అలీ

సంవత్సరం అవుతుంది పరిహారం అందలేదు



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే మా ఎద్దు మృతి చెందింది. సంవత్సరం అవుతున్నా నేటికీ పరిహారం రాలేదు. పశువుల ఆధారంగానే జీవనం కొనసాగిస్తున్నాం. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలి.

– కుసంగి శ్రీను, పశు పోషకుడు, పైతర

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే...



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే పశువులు చనిపోతున్నయ్. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా బర్రె విద్యుత్ ప్రమాదంలో చనిపోయి రెండు సంవత్సరాలయ్యింది. అదికారులు పంచనామా కూడా చేసింద్రు. ఇప్పటి వరకు ఏ సహాయం అందలేదు. అధికారులు స్పందించాలి.

– ఎలకుర్తి సాయిలు, పశుపోషకుడు, వైమాందాపూర్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కార్మిక సంఘాల జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదరి మల్లేశం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం, వక్తలుగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి జి మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీరం మల్లేశం మాట్లాడుతూ 'నరేంద్ర మోదీ నాయకత్వంలోని కార్పొరేట్ అనుకూల కేంద్ర బీజేపీ ప్రభుత్వం బరితెగించి ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నది. జాతీయ సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు అమ్మేస్తున్నది. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచింది. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. రాజ్యాంగ బద్ధంగా పౌరులకున్న ప్రాథమిక హక్కులకు సైతం పాతరేస్తున్నది. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా, స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజానీకం ఎంతో శ్రమించి అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ మౌలిక వసతులు, సహజ వనరులను కార్పొరేట్లు లూటీ చేసే విధానపర నిర్ణయాలను కేంద్రం అమలు చేస్తున్నది. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ ు సంస్థల్లో 100 శాతం వాటాలు తెగనమ్ముతున్నది. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ (ఎన్ఎంపి) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ధారాదత్తం చేస్తున్నది. జాతీయ రహదారులు, రైళ్ళు, విద్యుత్ స్టేషన్లు, ట్రాన్స్మిషన్, చమురు-సహజ వాయివు పైప్ లైన్లు, బొగ్గు గనులు, టెలికం టవర్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, ఎఫ్.సి.ఐ గోడౌన్లు, క్రీడా మైదానాలతో సహా ప్రజా ఆస్తులన్నింటిని కార్పొరేట్లకు అమ్మేస్తుంది. దీని వల్ల రాబోయే కాలంలో ప్రజలు ఈ సౌకర్యాల కోసం వేలాది రూపాయలు ఎ చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు అప్పజెప్తున్నది. మన రాష్ట్రంలో సింగరేణిలోని 4 బొగ్గు గనులను వేలం వేసింది. హైదరాబాద్లో కేంద్రీకృతమై వున్న బిడిఎల్, బిఇఎల్, బిహెచ్ఐఎల్, హెచ్ఎఎల్, మిథాని లాంటి సంస్థలలో సుమారు 25 నుండి 50 శాతం దాకా వాటాలు అమ్మేసింది. కార్మికులు, మధ్యతరగతిలో అత్యధికులు పాలసీదార్లుగా వున్న ఎల్ఐసిలో లక్ష కోట్ల రూపాయల వాటాలు అమ్మేందుకు తెగబడింది. అనేక త్యాగాలు, రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లు మారుస్తూ పార్లమెంట్ లో చట్టం చేసింది. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడింది. పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాస్తున్నది. సామాజిక భద్రతా కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం- పని పరిస్థితుల కోడ్లతో పిఎఫ్, ఇఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తున్నది. తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తున్నది. ఇలాంటి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహించాలి' అని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు సంద బోయిన ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి కళావతి, ఎం పద్మ, బండ్ల స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి లు చొప్పరి రవికుమార్, తునికి మహేష్ లు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వేణుగోపాల్, మామిడాల కనకయ్య,ఎస్.రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు అందే అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్, జిల్లా కోశాధికారి జి నర్సింలు హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు ఇదారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులపై వేధింపులు మానుకోవాలి











- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్

నవతెలంగాణ కొండపాక

గ్రామపంచాయతీ కార్మికులపై వేధింపులు మానుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుండి గ్రామపంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదని, తుమ్మితే ఊడిపోయే ముక్కులగా మనల్ని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం 11వ రోజు సమ్మెకు మద్దతు తెలియజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలతో ప్రభుత్వం ఇచ్చే వేతనాలు రూ.9,500 సరిపోవడం లేదని అన్నారు. అనేక గ్రామాల్లో వీటిని కూడా అమలు చేయని పరిస్థితి ఉందని అన్నారు. ఆదివారం, పండుగ సెలవులు కట్టి ఇవ్వాలన్నారు. కారోబార్లను పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికుల ఆగ్రహానికి గురి కాకుండా ఉండాలంటే వెంటనే వారి నాయకత్వంతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు లేనిపక్షంలో గ్రామపంచాయతీ కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ప్రత్యక్ష పోరాటాలకు కూడా వెనుకాడే ప్రసక్తి లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. కనకాచారి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య,గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య నాయకులు జాలిగామ ప్రభాకర్,బోగి సాయి కుమార్ ఆరుట్లనర్సయ్య పల్లే శ్రీనివాసు, పిల్లి లచ్చవ్వ, ఎల్లయ్య, మల్లయ్య, ఎల్లవ్వ బాలవ్వ, చంద్రయ్య, లక్ష్మణ్, కొమ్మునర్సింలు, శంకర్ బాబు, పుష్ప, నాగవ్వ లక్ష్మి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్: రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది గ్రామపంచాయితీ సిబ్బంది స్వీపర్లుగా, పారిశుద్ధ్య కార్మికులుగా, పంప్ ఆపరేటర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా, డ్రైవర్లుగా, కారోబార్లుగా, బిల్ కలెక్టర్లుగా వివిధ కేటగిరిల్లో పని చేస్తున్నారు. వీరు ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన పేదలు. ఆరోగ్యాలను కూడా లెక్కచేయకుండా గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాల కోసం పని చేస్తున్నారు. స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. వీరిపట్ల ప్రభుత్వానికి కనికరం లేదు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు జూన్ 5 తేదీన సమ్మె నోటీస్ ఇచ్చారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూల్కై 6 నుంచి సమ్మె చేస్తున్నారు. పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం నాటికి 11వ రోజుకు చేరుకున్న సందర్భంగా అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.పద్మ సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మిక సంఘాల నాయకులను పిలిచి చర్చలు జరపాలన్నారు. ఈ నెల 18న ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కో కన్వీనర్ బాకీ యాదగిరి, నాయకులు మల్లయ్య, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన గ్రామపంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదని, కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా నాయకుడు కే వెంకట్‌చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా స్పందించడంలేదన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ వర్కర్ల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. మేడే రోజున వెయ్యి రూపాయలు పెంచిన పెరుగుతున్న ధరలతో ప్రభుత్వం ఇచ్చే వేతనాలు రూ.9,500 సరిపోవడం లేదని అన్నారు. అనేక గ్రామాల్లో వీటిని కూడా అమలు చేయని పరిస్థితి ఉందన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు డ్రెస్సులు సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం పండుగ సెలవులు కట్టి ఇవ్వాలని వేధింపులు అరికట్టాలని అన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలన్నారు. అర్హులైనవారిని కరోబార్లుగా నియమించాలని, కారోబార్లను పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు చెన్నయ్య యాదగిరి బిక్షపతి ,చంద్రం, బాబురావు, నారాయణ, నర్సింలు, శేఖర్ ఎల్లం బాబు పోశయ్య రవి పాల్గొన్నారు.

నవ తెలంగాణ- దౌల్తాబాద్: మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో ఆదివారం 11వ రోజు చేరిన సమ్మె సందర్భంగా సఫయి కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బోటుక రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోనీ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు 8వ రోజుకు సమ్మె చేరిందన్నారు. ఆయా గ్రామాలలో ప్రజా ప్రతినిదులు, అధికారుల వేధింపులు మానుకోవాలని హెచ్చరించారు. జీవో నెంబర్ 51ప్రకారం అక్రమ తొలగింపులు చేయరాదని తెలిపారు.కేంద్ర బిజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4లేబర్ కొడ్లను తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా తయారు చేస్తుందని విమర్శించారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలను పెంచి , మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం గ్రామ పంచాయితీల్లో పనిచేసే కార్మికులందరికీ న్యాయం చేసే వరకు తాము సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు బాలరాజ్, సఫాయి కార్మిక సంఘం అధ్యక్షుడు బోటుక రాములు, రాజలింగు నాగరాజు, మల్లేశం,నర్సింలు, బర్ర మమత,భాగ్య, అలువాల రమ, బుచ్చవ్వ, కనకవ్వ లక్ష్మి, బాలవ్వ, నర్సవ్వ, బ్యాటరి కిషన్,దాదాఖాన్,ఎగ్బల్, బ్యాగరి లచ్చయ్య, రవి, శ్రీను, సాయిలు, అశోక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె 11 వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు మరణిస్తే ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించా లని డిమాండ్ చేశారు.సమ్మెను నిర్వీర్యం చేసేందు కు అధికారులు కార్మికులపై వత్తిడి చేయడం సరి కాదన్నారు.గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తున్న మా సమ్మెకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, రాజయ్య మల్లయ్య, లక్ష్మ, బుధవ్వ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడిగా సర్పంచ్



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో ఓ వీధి కుక్క రెండు రోజుల క్రితం మృతి చెందింది. బస్టాండ్ చౌరస్తాలో పడి ఉండడంతో దుర్వాసన వస్తోంది. సర్పంచ్ కాంటారెడ్డి జనార్దన్ రెడ్డి ఆ వీధి కుక్కను తాడుతో కట్టి తన ద్విచక్ర వాహనానికి కట్టుకొని ఊరు అవుతల పడవేసి పంచాయతీ కార్మికుడిగా అవతారమెత్తారు. 88 ఏళ్ల వయసులో గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే స్పందించి సేవలు చేస్తున్న సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వెంకట్‌రెడ్డికి విగ్రాం శ్రీనివాస్ గౌడ్ పరామర్శ



నవతెలంగాణ-నారాయణఖేడ్

నియోజకవర్గ పరిధిలోని హెూక్రాణ గ్రామానికి చెందిన రావుల వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెల్సుకున్న కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ మాజీ డైరక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, విగ్రాం రామా గౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మెన్ విగ్రాం శ్రీనివాస్ గౌడ్ ఆదివారం వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలని భరోసాని చ్చారు. ఈ కార్యక్రమంలో అంజ గౌడ్, హన్మంతు, క్రిష్ణమూర్తి, క్రిష్ణగౌడ్, నాగరాజ్. మహష్. తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామచంద్రాపురం

ఆషాడ మాసంలో తెలంగాణ సాంప్రదాయ బోనాల పండుగను ఆదివారం రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్లు మరియు బెల్ టౌన్షిప్‌లో ఘనంగా నిర్వహించారు. పలు అమ్మవారి ఆలయాల్లో ఉదయాన్నే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక మండలి చైర్మెన్ భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సాంప్రదాయ బోనాల పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. అమ్మవారి కృపతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, నాగేష్ నాయకులు పరమేష్ యాదవ్, బూన్, మోహన్ రెడ్డి, కుమార్ గౌడ్, ఐలేష్, మల్లేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని బొంతపల్లి, దోమడుగు తదితర గ్రామాల్లో ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం ఆయా గ్రామాల పాలకవర్గం ఆధ్వర్యంలో దుర్గమ్మ పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో పాటు మండల ప్రజా ప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, జడ్పిటిసి కుమార్ గౌడ్, బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు షేక్ హుస్సేన్, గ్రామ అధ్యక్షుడు ముంళి, వార్డు సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బాలు యాదవ్, యూత్ అధ్యక్షులు కిరణ్, నాయకులు మంగయ్య, అంజిరెడ్డి, వెంకటరెడ్డి, శేఖర్ రెడ్డి, రాజు, శ్రీనివాస్, సాయి, శేఖర్, జ్ఞానేశ్వర్ మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన రోషన్ రెడ్డి

నవతెలంగాణ-నారాయణఖేడ్

పంచగామా కమాన్ నుంచి బొరంచ మీదుగా రూ.4కోట్ల 25 లక్షల 75 వేలతో నిరిస్తున్న రాణాపూర్, తుమ్నూర్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే తనయుడు రోషన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ మండల జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్‌గొండ ఉన్నారు.



ఓల్డ్ విలేజ్ బోనాల ఉత్సవాల్లో చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఓల్డ్ విలేజిలో ఆషాడ మాసం సందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పెద్దమ్మ గుడి అమ్మ వారికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి పాల్గొని.. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన్ను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోప్షన్ సభ్యులు రంగారెడ్డి, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, మాధవ్ రెడ్డి, భరత్ చారి, సంపత్ రెడ్డి, నగేష్, వెంకటేష్ , కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాలకు ఎంపీపీ సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఆదివారం బోనాల సంబు రాలు ఘనంగా జరిగాయి. ఈ బోనాల ఉత్సవాల్లో ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ పాల్గొని.. ఉత్సవాల కోసం రూ.10వేల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీస్సులతో మండల ప్రజానీకం పైరు పంటలతో సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డీ కృష్ణ, కోరబోయిన నరేష్, యనగండ్ల నరేందర్, పల్నాటి భాస్కర్, వడ్ల బిక్షపతి, ఆనంద్, శ్రీధర్, నరేష్ నాగభూషణం, నగేష్,విష్ణుమూర్తి, వినోద్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక యువకులు,నాయకులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎస్సైకి ఘన సన్మానం

నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై వినయ్‌కుమార్ బదిలీపై కొండా పూర్ స్టేషన్‌కు వెళ్తున్నారు. దీంతో సిబ్బంది ఆయన్ను పూలమాల, శాలువాతో ఆదివారం ఘనంగా సన్మానించారు. రెండేండ్లు ఇక్కడ విధులు నిర్వహించిన ఆయన.. మంచి పేరు సంపాదించుకున్నారు. కాగా ఆయన స్థానంలో హద్నూర్ ఎస్సైగా పటాన్‌చెరు నుంచి రామానాయుడు వస్తున్నట్టు సమాచారం. సన్మానించిన వారిలో జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మరోమారు మభ్యపెట్టడానికి బీఆర్ఎస్ ప్రయత్నం



నవతెలంగాణ-గుమ్మడిదల

రైతులను మరోమారు మభ్య పెట్టడానికి బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని గుమ్మడిదల యూత్ కాంగ్రెస్ యువ నాయకుడు ఇప్ప రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏకకాలంలో రుణమాఫీ, నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, నిరుద్యోగ భృతి లాంటి హామీలను పెట్టినప్పటికీ.. ఏ ఒక్కటి అమలు జరగలేదన్నారు. రైతు సమన్వయ కమిటీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ చెప్పిన రైతులకు ఉచిత ఎరువుల ఊసే లేదన్నారు. ఇలాంటి ఎన్నో హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. అయితే ఇటీవలే కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఖమ్మం సభ విజయవంతం కావడంతో.. కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేంతవరకు నాయకులు, కార్యకర్తలుసైనికుల్లా కష్టపడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

మల్లారెడ్డిపేట పాఠశాలకు
పునర్వైభవం

- విద్యార్థుల్లేరని ఏడాది క్రితం మూతపడిన పాఠశాల
- సమీప పాఠశాలకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడిన విద్యార్థులు
- తిరిగి తెరవాలని పట్టుబట్టిన గ్రామస్తులు
- ఇటీవలే ఓపెన్ కావడంతో.. 20 మంది వరకు చేరిక
- ప్రస్తుత ఉపాధ్యాయుడి చొరవ, గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు పునర్వైభవం

'విద్యార్థులు లేరనే కారణంతో ఆ ప్రభుత్వ పాఠశాలను ఏడాది క్రితం మూసేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన విద్యార్థులంతా సమీప గ్రామంలోని పాఠశాలకు వెళ్లి చదువుకునే వారు. ఇలా వెళ్లి, వస్తున్న సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. వర్షం వస్తే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. పిల్లలు స్కూలుకు వెళ్లింది మొదలు.. తిరిగి ఇంటికొచ్చే వరకు తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలో ఉండేవారు. దీంతో ఎలాగైనా తమ గ్రామంలోని పాఠశాలను తిరిగి ఓపెన్ చేయాలని గ్రామస్తులంతా కలిసి ధర్నా చేశారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఇటీవలే పాఠశాలను తిరిగి ఓపెన్ చేయగా.. 20 మంది వరకు విద్యార్థులు చేరారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడి చొరవకు, గ్రామస్తుల సహకారం తోడవంతో ఆ పాఠశాల తిరిగి పూర్వవైభవాన్ని తెచ్చుకుంది. ఆ పాఠశాలే సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి మండలంలో గల మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల.'



క్లాస్‌రూం..



స్కూల్ తెరవాలంటూ జూన్ 20న ధర్నా చేస్తున్న ఫోటో..

నవతెలంగాణ-మునిపల్లి

మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉన్నప్పటికీ విద్యార్థులు లేరని, మరికొన్ని కారణాలతో ఏడాది క్రితం మూతబడింది. దీంతో విద్యార్థులు సమీపంలోని మల్లికార్జునపల్లి ప్రాథమిక పాఠశాలకు మల్లారెడ్డిపేట నుంచి కాలినడకన, ఆటోల్లో ప్రయాణించి చదువుకునేవారు. వర్షం పడిన రోజు ఆ విద్యార్థుల బాధ వర్ణనాతీతం. పిల్లలు పాఠశాల నుంచి తిరిగి వచ్చేవరకు తల్లిదండ్రులు ఎంతో ఆందోళన పడేవారు. ఈ విషయాన్ని నవతెలంగాణ దినపత్రిక అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. దీనికితోడు సర్పంచ్ శివజ్యోతి, గ్రామానికి చెందిన సామాజిక సేవకులు, మంజీర రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్‌లు గ్రామంలో బడి ఉండాల్సిందేనని పట్టుబట్టారు. ప్రస్తుతం పాఠశాలలో పనిచేసిన రెగ్యులర్ ఉపాధ్యాయుడు అరవింద్‌ను కాకుండా మరో ఉపాధ్యాయుడితో పాఠశాల కొనసాగిస్తే విద్యార్థులను పంపుతామని గ్రామస్తులంతా మండల విద్యాధికారి దశరథ్‌కు స్పష్టం చేశారు. అంతేకాకుండా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 20న విద్యా దినోత్సవం రోజు పాఠశాలను తెరిపించండి అంటూ గ్రామస్తులు పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. ఆటోల్లో మల్లికార్జునపల్లి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులను ఆపి.. గ్రామంలోని పాఠశాలకి పంపించాలని వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. దీంతో గ్రామస్తుల కోరిక మేరకు మునిపల్లి మండలలోని చీలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను మల్లారెడ్డిపేట పాఠశాలకు సర్దుబాటు చేశారు.

పాఠశాలకు పునర్వైభవం..

ప్రస్తుతం పాఠశాలకు కేటాయించబడిన ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 20 మంది విద్యార్థుల వరకు పాఠశాలలో చేరారు. కాగా ప్రవీణ్ కుమార్ తన సొంత నిధులతో మొదటగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, ఇతర రాత సామాగ్రి అందజేశారు. అంతేకాకుండా తన సొంత నిధులతో విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగేందుకు ప్రత్యేక కృషి చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న గోతులను సర్పంచ్ శివజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరేశం సహకారంతో మట్టి వేసి చదును చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల ప్రహరీ విషయంలో కూడా మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా సర్పంచ్ సహకారంతో విద్యార్థులకు మినరల్ వాటర్ అందించే సౌకర్యం కల్పించారు. విద్యా సంవత్సరం ఆరంభమైన తర్వాత పాఠశాల ప్రారంభమైనందున ప్రస్తుతం 20 మంది విద్యార్థుల వరకు వస్తున్నారని మరింత పెరిగే అవకాశం ఉన్నదని ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. విద్యార్థుల రాక.. పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులతో మల్లారెడ్డి పాఠశాలకు పునర్వైభవం వచ్చింది.

పాఠశాలను తెరవడం సంతోషంగా ఉంది



గ్రామంలో పాఠశాల తిరిగి తెరుచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ప్రధానోపాధ్యాయుడితోపాటు గ్రామ స్తుల సహకారం వల్లనే ప్రభుత్వ బడిని తిరిగి ప్రారంభిం చగలిగాం.

-శివ జ్యోతి, సర్పంచ్

ప్రభుత్వ పాఠశాలకు గ్రామస్తుల సహకారం ఉండాలి



ప్రతి గ్రామంలో కూడా ప్రభుత్వ పాఠశాలకు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరం. అప్పుడే ఉచిత విద్య ప్రజలకు చేరుతుంది. గ్రామంలో పాఠశాల బలోపేతా నికి ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్ చూపిన చొరవ మరవలేనిది.

-తుమ్మలపల్లి పృథ్వీరాజ్, మంజీరా రైట్స్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తా



ప్రభుత్వ పాఠశాల మనుగడ సాధించాలంటే ఉపాధ్యాయుడి చొరవతోపాటు గ్రామస్తుల సహకారం ఎంతగానో అవసరం. పాఠశాలను తిరిగి ప్రారంభించే విషయంలో సర్పంచ్‌తో పాటు గ్రామస్తుల సహకారం ఎంతో లభించింది. వారి సహకారం మరింత ఉత్తేజాన్ని కల్పించింది. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తా.

-ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

ప్రవీణ్‌కుమార్ ముందుకు రావడం సంతోషాన్నిచ్చింది



కష్టాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలకు తిరిగి పునర్వైభవం తీసుకొస్తానని ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ముందుకు రావడం సంతోషాన్నిచ్చింది. చీలపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ మల్లారెడ్డిపేట పాఠశాలను దత్తత తీసు కోవడం ఆనందాన్నిచ్చింది. ఉపాధ్యాయుల చొరవ, సమయస్ఫూర్తి వల్లనే ప్రభుత్వ పాఠశాలను బతికించగలుగుతాం.

-దశరథ్, మండల విద్యాధికారి

ఛత్రపతి శివాజీ గొప్ప పరిపాలన దక్షుడు



నవతెలంగాణ-అమీన్‌పూర్

నేటి యువతరానికి స్ఫూర్తి ప్రదాత అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప పరిపాలనా దక్షుడని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ గొప్ప పోరాటయోధుడు గానే కాకుండా గొప్ప పరిపాలనాదక్షుడుగా పేరు పొందారన్నారు. చరిత్రలో గొప్ప నాయకులుగా కీర్తించబడ్డ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సంతోషకర మన్నారు. వారి చరిత్రను, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను నేటి తరానికి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో శివాజీ విగ్రహాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. యువత పెడదారి పట్టకుండా దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గండిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, దాయర సర్పంచ్ భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకులు రాజు, మల్లేష్, శ్రీకాంత్, గ్రామ పుర ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యేల ఆగ్రహం



నవతెలంగాణ-పటాన్‌చెరు

రైతులకు ఉచిత విద్యుత్ అంశంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు.. తెలంగాణ రైతాంగం, బీఆర్ఎస్ పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దురహంకార వ్యాఖ్యలు చేస్తున్నాడని.. ఆయన వైఖరిని జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ శాసన సభాపక్ష కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, మదన్‌రెడ్డి, క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌లు మాట్లాడారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో రేవంత్‌రెడ్డి లాంటి చిల్లర రాజకీయ నాయకుడిని చూడలేదని ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రిని తిట్టి రాజకీయాల్లో ఎదగాలంటే తెలంగాణ ప్రజలు తరిమి తరిమి కొడతారన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని.. దమ్ము ధైర్యం ఉంటే పటాన్‌చెరు సబ్‌స్టేషన్ వద్ద చర్చకు రావాలన్నారు. పటాన్చెరు ప్రాంతానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి టంగుటూరి అంజయ్య తక్కువ చదువుకున్నా.. సంస్కరంలో ఉన్నతుడిగా కీర్తి పొందారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి కనీసం దివంగత అంజయ్యను చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవుపలికారు. అలాగే రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. పోరాటాల గడ్డ తెలంగాణ సమాజం ఎప్పటికిని రేవంత్‌రెడ్డిని స్వీకరించబోధన్నారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్ల అంశంపై మాట్లాడటానికి రేవంత్‌రెడ్డికి ఏ అధికారం ఉన్నదన్నారు. రేవంత్‌రెడ్డి తన వైఖరిని మార్చు కుని క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ సమాజం వెలివేస్తుందన్నారు.

ఖాజీపల్లి శివారులో రసాయనాల పారబోత

- డ్రమ్ముల్లో తీసుకొచ్చి పారబోసిన దుండగులు
- గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల తీవ్ర ఆగ్రహం
- పరిశ్రమలు, పీసీబీ తీరుపై మండిపాటు





నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన ఖాజీపల్లి శివారులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు రసాయ నాలతో నిండిన కాలుష్య డ్రమ్ములను విచ్చలవిడిగా పారబో శారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ చిట్ల సత్యానారాయణ, ఎంపీటీసీ ఆకుల భార్గవ్‌లకు గ్రామస్తులు తెలియజేశారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడు తూ.. స్థానికంగా పెద్ద ఎత్తున స్థానిక పరిశ్రమలు ఇక్కడ ఉండడం.. ప్రతినిత్యం పారిశ్రామిక కాలుష్య జలాలతో ఇబ్బంది పడడం తమ పాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వారు విచ్చలవిడిగా కాలుష్యపు డ్రమ్ములను వందల కొద్ది సంఖ్యలో పారబో యడం వెనుక మతాలబు ఏమిటంటూ మండిపడ్డారు. రామచంద్రపురం కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఈ అంశంపై ఫోన్లో సమాచారం అందించామన్నారు. అయితే వారు తక్షణమే స్పందించకుండా.. సిబ్బంది సరి పోను లేరని.. అక్కడికి చేరుకోవడానికి సమయం పడుతు ందంటూ సమాధానాలు ఇచ్చారని.. ఇది ఎంతవరకు సమంజసమన్నారు. కాలుష్యం అంశంపై రెండు నెలల కిందట, అంతకుముందు పలుమార్లు వివరించినా.. పరిష్కారం మాత్రం లభించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కుబడిగా రావడం శాంపిల్స్ సేకరించడం పరిపాటిగా మారిందన్నారు. రంగారెడ్డి జిల్లా శివారు కలిగి సంగారెడ్డి పరిధిలో ఉన్న ప్రాంతానికి శాశ్వతంగా కాలుష్యపు జలాలు బెడదను నివారించాలని విజ్ఞప్తి చేశారు. పారబోసిన డ్రమ్ముల కాలుష్యం కారణంగా అటవీ ప్రాంతంలో కొంగలు, పాల పిట్టలు, తొండలు ఇలాంటి జీవరాసులు కూడా బలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పీసీబీ అధికారుల నిర్లక్ష్యపు తీరు పై మండిపడ్డారు.



మాట్లాడుతున్న సర్పంచ్, తదితరులు..

నరోత్తం సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-జహీరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరిన మాజీ టీపీసీసీ నాయకులు వై.నరోత్తం.. ఆదివారం తన అనుచరగణాన్ని హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు తీసుకువెళ్లి మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేర్పించారు. నియోజకవర్గంలోని కోహిర్, ఝరాసంఘం, న్యాల్కల్, మొగుడంపల్లి , జహీరాబాద్ మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో ప్రగతిభవన్‌కు తరలి వెళ్లారు. జహీరాబాద్ నుంచి వారి కాన్వాయ్ బయలుదేరే ముందు పట్టణంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ర్యాలీగా జహీరాబాద్ నుంచి వాహనాలు ప్రగతి భవన్ కు చేరుకున్నాయి. అక్కడ వారందరికి కండువా కప్పి పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు. ఇప్పటికే నరోత్తంతో పాటు ఢిల్లీ వసంత్ కూడా పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కాగా జహీరాబాద్‌లో ఇతర పార్టీలకు చెందిన వారు ఎవరు కూడా లేకుండా చేస్తానని బహిరంగంగా ప్రకటించిన మంత్రి హరీశ్‌రావు.. ఆ దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు షాకీ వస్తాద్, సర్పంచులు రాంరెడ్డి, నర్సింలు, నారాయణ, రాములు, జగన్మోహన్‌రెడ్డి, భీంసింగ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జెఎస్ కళాశాలలో నీట్, ఐఐటి- జేఈఈ కోచింగ్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని జెఎస్ జూనియర్ కళాశాలలో నీట్, ఐఐటి- జేఈఈ కోచింగ్ ప్రారంభిస్తున్నట్టు కళా శాల డైరెక్టర్ ఎండీ.ఇక్బాల్ జావీద్ అన్నా రు. శనివారం జహీరాబాద్‌లోని జెఎస్ కళాశాలలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జులై 23న స్కాలర్షిప్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు.. ఈ టాలెంట్ టెస్ట్‌కు రిజి స్ట్రేషన్ కొరకు జేఎస్ జూనియర్ కళాశాల కార్యాల యంలో సంప్రదించాలన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఏ కళాశాలలో లేని కోచింగ్‌ను జెఎస్ కళాశా లలో ప్రవేశ పెడుతున్నట్టు చెప్పారు. ఇంటర్మీ డియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో మొదట ప్రవేశం తీసుకున్న 100 మంది విద్యా ర్థులకు కేవలం రూ.3000తో విద్యాబోధన అందిస్తామన్నారు. తమ కళాశాలపై వస్తున్న అసత్య ప్రచారాలు ఎవ్వరు నమ్మొదని.. కొంద రు పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. దానికి దీటుగా ఉత్తమ లెక్చరర్లతో బోధన చేస్తున్నామన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు వెంటనే ఇవ్వాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు నియోజక వర్గంలో డబుల్ బెడ్రూం ఇండ్లు వెంటనే ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎండీ వాజీద్ అలీ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సీపీఐ(ఎం) పటాన్‌చెరు పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పటాన్‌చెరు, రామచంద్రపురం పట్టణాల్లో వేలాది మంది డబుల్ బెడ్రూం ఇండ్లకోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఏండ్లు గడుస్తున్నా నియోజకవర్గంలో ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కూడా ఒక్కరికీ ఇవ్వకపోవడం గమనర్హామన్నారు. నియోజకవర్గంలో కొల్లూరు, అమీన్‌పూర్‌లలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారని, ఇందులో పోచారం, ఘణపూర్ చౌరస్తాలో నిర్మాణాలు పూర్తి కాలేవన్నారు. వేలాది కోట్ల రూపాయలు పూర్తిగా గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. ఏండ్లు గడిచిన కొద్దీ నిర్మాణం దెబ్బ తింటుందని వాపోయారు. లబ్దిదారులను గుర్తించి ఇంటి పట్టా సర్టిఫికేట్లు ఇచ్చి, ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థలం వుంచి ఇల్లు నిర్మించు కోవడానికి ఇస్తామన్న రూ.3 లక్షల హామీ ఏమయిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి నాగేశ్వరరావు, అర్జున్, రామచంద్ర మూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం నల్లపోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని ఐడిఏలోని ఐదో వార్డులో వెలసిన నల్ల పోచమ్మ తల్లి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ కొలను రవీందర్‌రెడ్డిని కాలనీవాసులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐడిఏబొల్లారంతో పాటు తెలంగాణ ప్రజలందరి పైన అమ్మవారి చల్లని చూపుండాలని మొక్కుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలి పారు. బోనాల పండుగ సందర్భంగా అందరూ కలిసిమెలిసి అమ్మవారికి బోనాలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు బషీర్, శ్రీశైలం, బాలయ్య, బాలరాజ్, హనుమంత్, శివకృష్ణ, చిరంజీవి, సంజీవ్, రాము, ఉపేం దర్, చిట్టిబాబు, హరి, కృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన ఎర్రబాబు ఇటీవలే మృతి చెందాడు. మృతుడి భార్య యశోదకు ఆదివారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి బియ్యం, ఆర్థిక సాయం పంపిం చినట్టు మాసాయిపేట ఎంపీటీసీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాసయ్యపేట యాదగిరి మాదిగతోపాటు మరికొంతమంది పాల్గొన్నారు.

కార్యకర్తల ఐకమత్యమే పార్టీకి బలం



నవతెలంగాణ-దుబ్బాక

కార్యకర్తల ఐకమత్యమే పార్టీకి బలం.. కుల,మతాల బేదభావాలు తమకు లేవని, తామంతా ఒక్కటేనని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని వైశ్య భవన్ లో రాష్ట్ర బీజేపీ పిలుపుమేరకు దుబ్బాక నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో 'టిఫిన్ బైటక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ తమ ఐక్యతను చాటి చెప్పేందుకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి బిజెపి ముఖ్య నాయకులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. తమ ఐక్యతకు నిదర్శనమే ఈ కార్యక్రమమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంతకుముందు వాసవి మాత ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్ గౌడ్,పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ చింత సంతోష్ కుమార్,సీనియర్ నాయకులు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి,3 వ వార్డ్ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి,బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సొంతగూటికి చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-రాయపోల్

మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురిచేసి డబ్బులతో బిజెపి నాయకులను, కార్యకర్తలను కొనాలనుకోవడం బీఆర్ఎస్ పార్టీ నాయకుల భ్రమేనని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన బిజెపి నాయకులను ఆదివారం తిరిగి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ వ్యక్తిగత పనుల నిమిత్తం గజ్వేల్ కి వెళ్లిన బిజెపి నాయకులకు మాయమాటలు చెప్పి ఎన్నో ప్రలోభాలకు గురిచేసి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీల చేర్చుకోవడం సిగ్గు మాలిన చర్య అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశం కోసం పనిచేస్తారని ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీగా పనిచేస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దుబ్బాక నియోజకవర్గం అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని, నియోజకవర్గ అభివృద్ధికి రావాల్సిన నిధులు అన్ని నిలిపివేస్తున్నారు. కొందరు డబ్బుతో నాయకులను కొనాలని చూస్తున్నారని బీఆర్ఎస్ డబ్బు రాజకీయాలు ఎక్కువ రోజులు చెల్లవన్నారు. ఎనిమిదేండ్ల నుండి వెనకబడ్డ దుబ్బాక ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది. డబ్బు సంచులతో ఇతర పార్టీ నాయకులను కొని ఆగం చేయాలని బీఆర్ఎస్ నాయకులు చూస్తున్నరని ఎమ్మెల్యే అన్నారు. బిజెపిలో చేరిన వారిలో భువనగిరి బాలరాజ్, ఎర్రోళ్ల ప్రశాంత్, భువనగిరి స్వామి. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రాజా గౌడ్, భూపాల్ రెడ్డి, నరేష్ గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమాన్ని ఉదతం చేయాలని జేఏసీ చేర్యాల మండల చైర్మన్ బొమ్మ గోని అంజయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంజయ్య పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకు అలుపెరగకుండా పార్టీలక తీతంగా ఐక్యంగా పోరాడాలన్నారు. పోరాటంలో అన్ని వర్గాల ప్రజలను ,మేధావులను, యువకులను, మహిళలను కలుపుకొని పట్టుదలతో ఉద్యమించాలన్నారు. అనంతరం గ్రామ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా పాకాల బిక్షపతి, కో కన్వీనర్లు అక్బర్ పాషా, నిమ్మ నర్సిరెడ్డి, సుతారి రమేష్, కార్యదర్శిగా బంగారు ఐలయ్య, సహాయ కార్యదర్శులుగా గుడ్ల బాబు, సూర్ణ శ్రీనివాస్,కర్రోళ్ల కర్ణాకర్, చీర్ల లక్ష్మయ్య, కోశాధికారిగా బంగారి ప్రమోద్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జేఏసీ మండల కో కన్వీనర్ కొంగరి వెంకట మావో, జేఏసీ సాంస్కృతిక విభాగం కన్వీనర్ మేడిపల్లి చందు, గొర్రె శ్రీనివాస్, పండుగ యాదగిరి, బుడిగం నర్సిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనూర్‌కు బదిలీ అయిన వట్‌పల్లి ఎస్సై

నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అంబార్యా మనూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సంగారెడ్డి వీఆర్‌లో ఉన్న కోటేశ్వరరావు వట్‌పల్లి ఎస్ఐగా రానున్నారు. కోటేశ్వరరావు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇంతకుముందు లాంగ్ లీవ్ పెట్టి వెళ్లినట్లు సమాచారం.

కొండాపూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వినయ్‌కుమార్



నవతెలంగాణ-కొండాపూర్

కొండాపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా వినయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరంచారు. హద్నూర్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు ఇదివరకు కొండాపూర్‌లో విధులు నిర్వహించిన ఎస్సై వెంకటేషం కల్హేర్ మండలానికి బదిలీ అయ్యారు.



బోనాల ఊరేగింపులో ఎంపీపీ గిరిధర్ రెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని రామ్‌నగర్‌లో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాల్లో జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డితో పాటు, ఉజ్వల రెడ్డి, బసంత్పూర్ శ్రీనివాసరెడ్డి, నర్సింహరెడ్డి, కండేం నర్సింలు, శుక్లవర్ధన్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కోహీర్

పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఏఎస్సై కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలం చిన్నహైదరాబాద్‌కు చెందిన పస్తాపూర్ అశోక్ అనే వ్యక్తి కోహిర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలో గల ఆయన అత్తవారి ఇంటికి శనివారం ఉదయం వచ్చాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ.. శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించి అతడి భార్య లక్ష్మి హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఘనంగా బోనాల ఉత్సవాలు







నవతెలంగాణ-కొల్చారం

మండల కేంద్రం కొల్చారం గ్రామంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శివాలయం నుండి ప్రారంభమైన బోనాల ఊరేగింపు శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య.. డోలు చప్పులతో వెళ్లి.. గ్రామంలోని ఎల్లమ్మ, పోచమ్మ దుర్గమ్మ, దేవత లకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రతి సంవత్సరం గ్రామ ప్రజల సహకారంతో బోనాల పండుగ కన్నుల పండువగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గ్రామ ప్రజలకు పాడిపంటలు సుభిక్షంగా పండాలని, అంటురోగాలు ప్రబలకుండా ఉండాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ దేవత ఎల్లమ్మ పోచమ్మ దుర్గమ్మ దేవతలకు బోనాలను సమర్పించారు.. ఈ కార్యక్రమంలో కండక్టర్ జూలకంటి సంగమేశ్వర్, సర్పంచ్ కరెంటు ఉమాదేవి రాజా గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ చెన్నయ్య, ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఆశన్నగారి కిష్టయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆంజనే యులు, గ్యాస్ కృష్ణ, సారా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ : నిజాంపేటమండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఐదో వార్షికోత్సవంలో భాగంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో కులాలకతీతంగా గ్రామంలోని మహంకాలమ్మకు డప్పు చప్పులతో బోనాలు, నేవేద్యాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సిద్ద రాములు మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారన్నారు. నస్కల్ గ్రామంలో ప్రతీయేడు గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురవాలని.. ప్రజలందరూ సుఖసంతోషాలతో అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంగ కవితరాజు, ఉపసర్పంచ్ తీగల జ్యోతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సుధాకర్ రెడ్డి,కారోబార్ శ్రీనివాస్ రెడ్డి,దేశెట్టి లింగం, ఎల్లం యాదవ్, యాదగిరి, సాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్ : మండలంలోని కుసంగి గ్రామంలో స్థానిక గౌడ సంఘం, సొసైటీ నిర్వహకులు అనంత గౌడ ఆధ్వర్యంలో గౌడ కులదైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ మాత అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లతో అంగరంగవైభవంగా అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంత సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలవురు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పీఈటిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకాంతం కుటుంబ సభ్యులతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు సత్య గౌడ్, పెద్దలు నారాయణ గౌడ్, రవి గౌడ్,శివరాం గౌడ్, తుకారం గౌడ్, లక్ష్మ గౌడ్, యద గౌడ్,ఎల్లా గౌడ్,సత్యనారాయణ గౌడ్, కిషన్ గౌడ్, నవాజ్ గౌడ్, ప్రకాష్ గౌడ్, యువకులు రమేష్ గౌడ్, అనిల్ గౌడ్, వెంకట్ గౌడ్, సతీష్ గౌడ్,లక్ష్మణ్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, చిన్నా గౌడ్, కిరణ్ గౌడ్, అభిలాష్ గౌడ్, అక్షయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి నిధుల గోల్మాల్ పై వాగ్వివాదం

- ఇరు వర్గాల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని సీఎస్ఐ చర్చి నిధుల గోల్మాల్ పై సంఘ సభ్యుల మధ్య ఆదివారం వాగ్వివాదం తీవ్ర వాగ్వివాదం జరిగి.. ఘర్షణకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆరాధన కార్యక్రమం ముగిసిన అనంతరం, సంఘ సభ్యులు సీఎస్ఐ చర్చికి వచ్చిన కానుకల లెక్కలు సుమారు రూ.50 లక్షల సంబంధించిన వివరాలను పాస్టర్లను అడగ్గా.. చెప్పడానికి నిరాకరించారు. అయితే గత ఆర్థిక సంవత్సరంలో చర్చి ఫండ్ ఖర్చు చేసినట్లుగా ఫాస్టర్ చూపిస్తున్నారని సంఘ సభ్యులు తెలిపారు. ఈ ఖర్చుకు సంబంధించిన బిల్లులు, ఓచర్లు చూపించమని అడిగితే పాస్టర్ నిరాకరించారన్నారు. దీంతో ఇరువురు సంఘ సభ్యుల మధ్య 'నీవెంత అంటే నీవెంత' అని ఘర్షణ వాతావరణం నెలకొంది. గతంలో పని చేసిన బిషప్ అండదండలతో సిఎస్ఐ చర్చిలో నిబంధనలకు విరుద్ధంగా కమిటీని ఏర్పాటు చేసి.. ఆ కమిటీ సభ్యులు ఎవరిని విచారంచకుండా రూ.50 లక్షల డబ్బులను సిఎస్ఐ చర్చి ఖర్చుల నిర్వాణ కోసం, ఎవరికీ చెప్పకుండా వారే ఆమోదం తెలుపుకొని లక్షల్లో డబ్బులు అన్యాక్రాంతం చేశారని సంఘ సభ్యులు ఆరోపించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి సంఘ సభ్యులకు బిల్లు చూపించి పూర్తి వివరాలు తెలపాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన చేస్తామని సంఘ సభ్యులు హెచ్చరించారు.

గజ్వేల్ ఆత్మీయ సమ్మేళనానికి తరలిన బ్రాహ్మణులు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ఉమ్మడి మెదక్ జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన అర్చక ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద శంకర్పేట మండలం నుంచి ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా ధూప దీప నైవేద్య ఆలయాల సంఖ్య పెంచడంతో పాటు ఈ పథకంలో పనిచేస్తున్న అర్చకులకు రూ.10 వేల వేతనాల పెంపు, వేదపండితులకు నెలవారి పింఛను పెంపు హర్షనీయమన్నారు. కార్యక్రమానికి తరలిన వారిలో మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కృష్ణ శర్మ, సభ్యులు రామాచారి, మహేష్ శర్మ, గిరిధర్ శర్మ, సంగమేశ్వర్, దత్తాత్రేయ స్వామి, వేణు స్వామి రాము తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు లొంగరు

- మండల అధ్యక్షుడు బక్కన్న గారి లింగం గౌడ్



నవతెలంగాణ-నిజాంపేట

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగరని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కన్నగారి లింగం గౌడ్ అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీలోకి వస్తే దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మీ పథకాలను ఇప్పిస్తామని పార్టీలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పథకాలు అందరికీ వర్తిస్తాయని.. ఆ పథకాలకు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులనే వాడుతారన్నారు. రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనని.. కాంగ్రెస్ పార్టీకి ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులను బీఆర్ఎస్‌లోకి చేర్చుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్ ,మండల కిసాన్‌సెల్ వైస్ ప్రెసిడెంట్ కన్నాపురం బాగాగౌడ్, శానం మధు మైనార్టీ ఉపాధ్యక్షులు, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్ ఎదుట గురుకుల టీచర్ల నిరసన దీక్ష





నవతెలంగాణ-సంగారెడ్డి

అన్ని మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ నేడు జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయం వద్ద కరపత్రం ఆవిష్కరణలో టీఎస్‌యూ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు పాల్గొని మాట్లాడారు. అలాగే సిద్దిపేటలో టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలి అహ్మద్, తప్పెట్ల యాదగిరి మాట్లాడారు. 6 మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న గురుకుల టీచర్లకు పారిటీ స్కేల్స్ ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డ్స్ జారీ చేయాలని, కెరిటేకర్స్, డిప్యూటీ వార్డెన్ నియామకాలు చేపట్టాలని వారు కోరారు. పని ఒత్తిడి తగ్గించాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా నేడు జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు జరుగుతున్న సందర్భంగా కలెక్టరేట్‌ల వద్ద నిరసన దీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిరసన దీక్ష కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయ మిత్రులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సాయి తేజ, చందర్ రాథోడ్ సంగారెడ్డి మండల అధ్యక్షులు ఎం. విజయానంద్ నాయకులు వెంకయ్య, కృష్ణ, శ్యాం ప్రసాద్, దేవేందర్, సిద్దిపేటలో జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి, జిల్లా కోశాధికారి ఎం కష్ణ, జిల్లా కార్యదర్శులు కొడి పల్లి ప్రశాంత్ కుమార్, కె కనకరాజు ,డి. శివలింగం,ఎల్. యాదయ్య, గురుకుల పాఠశాలలో కన్వీనర్ కష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, రామచంద్రం, తిరుపతి, రాజు, రంగు రాజమల్లు, గణేష్ రెడ్డి, నిరంజన్, రాములు, ప్రకాష్, రవి నాయక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట క్రాంతి యూత్ అధ్వర్యంలో మహంకాళి ఊరేగింపు

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలోని బెల్లంగౌనీ ఏరియాలో గల శ్రీ వేణు గోపాల స్వామి దేవాలయం నుంచి ఆదివారం మహంకాళి అమ్మవారి ఊరేగింపు క్రాంతియూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, క్రాంతి యూత్ సభ్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం క్లాక్ టవర్, గౌనీ చౌరస్తా, పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపు వైభవంగా కొనసాగింది. పోతురాజుల నృత్యాలు, డిజె సౌండ్ సిస్టంతో క్రాంతి సభ్యులు నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

వాడవాడలా బోనాల జాతర

- హాజరైన రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ఆషాఢ మాసం పురస్కరించుకుని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టినట్లు సిద్దిపేట పట్టణంలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. పట్టణ ఐదవ వార్డులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో జరుగుతున్న బోనాల జాతర ఉత్సవంలో ఆదివారం మంత్రి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఎంతో సంతోషంగా ఈ బోనాల పండుగను జరుపుకుంటున్నారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ కాలం తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, మంచి పంటలు పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, యూరోప్, వివిధ దేశాలలో ఉండే తెలంగాణ ప్రాంత వాసులు ప్రపంచ వ్యాప్తంగా బోనాల పండుగ జరుపుతూ మన ప్రాంత, ప్రజల సంస్కృతి, సంప్రదాయం కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ పండుగ తమ సంప్రదాయ పద్ధతిలో అక్కచెల్లెలు బోనాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయం కాపాడాల్సిన బాధ్యత మనపై ఉన్నదని, ఎంత చదివినా, దేశ, విదేశాలకు వెళ్లినా మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందజేసే విధంగా అందరూ కలిసికట్టుగా ఈ సంప్రదాయం నిలబెట్టడానికి కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు. పట్టణంలోని వాడ వాడల పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు గ్రామ దేవత అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ప్రతీ ఆలయం వద్ద డప్పు, చప్పుళ్ల దరువుల నడుమ మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గడికోట అమ్మవారికి బోనాలు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

ఆషాడ మాసం పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలోని గడికోట మహంకాళి దుర్గామాత అమ్మవారికి ఆదివారం మహిళా భక్తులు బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ నుండి మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని భాజా భజ్యంత్రీలతో.. శివశక్తుల నృత్యాలతో, పోతురాజుల విన్యా సాలతో ఊరేగింపుగా గడికోటకు చేరుకొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం శ్రీ సరస్వతి శిశు మందిర్ నుండి గడికోట వరకు అమ్మవారి చిత్రపటం తోటలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గడికోటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ , ఎంపీటీసీ వీణ సుభాష్ గౌడ్, ఉపసర్పంచ్ దశరథ్, నాయకులు, గ్రామ పెద్దలు వేణుగోపాల్ గౌడ్, అన్నారం సత్యనారాయణ, గంగారెడ్డి, జస్వంత్, కుమ్మరి మల్లేశం, రవి వర్మ, పున్నయ్య, లోత లక్ష్మణ్, చాకలి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి మహాధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-హవేలీఘనపూర్

గిరిజనులకు పూర్తి స్థాయిలో పోడు భూముల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ రేపు(మంగళవారం) కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని.. విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగాసాన్‌పల్లి తాండాలో ఆదివారం వారు పర్యటించి మాట్లాడారు. మెదక్ జిల్లాలో అర్హులైన గిరిజను లకు పోడు పట్టాలు అందజేయాలన్నారు. గిరిజనులకు పట్టాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపిం చారు. పోడు భూముల పట్టాల కోసం ఎందరో గిరిజన రైతులు, ఉద్యమకారులు ఉద్యమాన్ని చేసి వారి జీవితాన్ని కూడా త్యాగం చేశారన్నారు. కాగా ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తామని చెప్పి.. కొంతమందికి మాత్రమే ఇచ్చిం దన్నారు. పూర్తిస్థాయిలో పోడు భూముల పట్టాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అన్ని తాండాల్లో ఒకరిద్దరికి ఇచ్చి.. అందరికీ ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్నదని ఆరోపించారు. కాబట్టి ఈ సమస్య పరిష్కారం కోసం రేపు చేపట్ట నున్న మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, మెదక్ నియోజకవర్గం అధ్యక్షులు రంజిత్ నాయక్, ఉమ్మడి జిల్లా నాయకులు శ్రీనివాస్ శ్రీకాంత్, భాస్కర్, బాబు ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

పారిశ్రామిక వాడలో ఘనంగా బోనాల సంబురాలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పారిశ్రామిక వాడలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు నిర్వహించారు.ఆదివారం పోచమ్మ ఆలయం, పెద్దమ్మ తల్లి గుడి, వైయస్సార్ కాలనీ, బీసీ కాలనీలో ఉదయం నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బొల్లారం మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్‌రెడ్డి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

టి.రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు..

బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బీజేపీ సీనియర్ నేత టి.రవిందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ నాయకురాలు మేఘనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌కు 51 మంది హాజరు



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ (ఓయూ క్యాంపస్)లో యు పి ఎస్ సి సివిల్ సర్వీసెస్‌కు లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణ కోసం నిర్వహించిన ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌కు 51 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మురళి తెలిపారు. ఆదివారం ఇందూర్ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్ కళాశాలలో పరీక్షకు 80 మంది విద్యార్థులకు 51 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్దిపేట బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ దయ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



నవతెలంగాణ కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన మహిళ 108 అంబులెన్స్ లో ప్రసవించింది. మర్పడగ గ్రామానికి చెందిన గర్భవతి ఎండి సిమ్రాన్‌కు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గ్రామానికి చెందిన ఆశా వర్కర్ వసంత 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ లో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు తక్కువ కావడంతో మార్గమధ్యంలో నిలిపి సిబ్బంది మహేందర్, రమేష్ 108 కాల్ సెంటర్ డాక్టర్ గోపి సూచనలు పాటిస్తూ ఆమెకు సుఖ ప్రసవం చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

అవకాశం ఎవరిదో?

రాష్ట్రంలో మానకొండూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానముంది. ఇక్కడ పోటీ చేసి ఎన్నికైన అభ్యర్థులు కంచుకోటగా మలుచుకున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నడూ కనీస ఆదరణ లభించలేదు. మొట్టమొదటి సారిగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. కాలంతో పాటు పరిస్థితులు మారడంతో రెండు దఫాలుగా బీఆర్ఎస్ నుండి పోటీ చేసిన అభ్యర్థి రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఓరుగంటి ఆనంద్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ ఇరువురు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్టు సమాచారం. దీంతో అధికార పార్టీలో అధిపత్య పోరు బహిర్గతమైంది. అధికార పార్టీకి ప్రత్యర్థులతో పాటు అధిపత్య పోరు ఉత్పన్నమవ్వడంతో రాబోయే ఎన్నికల్లో మహాయుద్ధంతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్నో సవాళ్లను ఎదుర్కోక తప్పదని అంటున్నారు. ఈసారి మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎవరు సఫలమవుతారో? ఎవరు విఫలమవుతారో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

- అంతుచిక్కని మానకొండూర్ రాజకీయాలు
- బీఆర్ఎస్, బీజేపీలో ఆశావహులు
- రాబోయే ఎన్నికల్లో మహాయుద్ధం తప్పదంటున్న రాజకీయ విశ్లేషకులు
- అన్ని రాజకీయ పార్టీల్లో తారాస్థాయిలో వర్గ విభేదాలు

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ఆటాపాటలతో తనదైన శైలిలో పాత్ర పోషించి బీఆర్ఎస్ అధిష్టానంలో సుస్థిర స్థానం సంపాధించాడు ఏర్పుల రసమయి బాలకిషన్. రాష్ట్రం ఏర్పాటు అనంతరం జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ అధిష్టానం రసమయిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. ప్రజల్లో నాటుకుపోయిన తెలంగాణ వాదమే రసమయిని రెండు దఫాలుగా ఎమ్మెల్యే ఎన్నికకు దోహదపడిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇంతవరకు సజావుగానే ఉన్న రాష్ట్ర సాధనోద్యమ సమయంలో అధిష్టానం ఆదేశానుసారం పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసి రెండు దఫాలుగా ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి త్యాగం చేశానని.. ఈసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకే అవకాశమిస్తుందని మరో ఉద్యమకారుడు ఓరుగంటి ఆనంద్ బాహాటంగానే చెబుతున్నాడు. కాంగ్రెస్ పార్టీని వీడి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ ఎమ్మెల్యే టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో మానకొండూర్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో స్తబ్దత వాతావరణం నెలకొంది. ముగ్గురిలో ఎవరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటిస్తోందని శ్రేణులు ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గ స్వరూపం

2009లో ఏర్పాటైన మానకొండూర్ నియోజకవర్గం మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలతో పాటు కొత్తగా ఏర్పడిన గన్నేరువరం మండలాలను కలిగి ఉంది. నియోజకవర్గంలో సుమారుగా మొత్తం 2లక్షల12వేల 135(స్త్రీలు1,07,352, పురుషులు1,04,783) మంది ఓటర్లు ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మానకొండూర్ నియోజకవర్గంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో పాటు గత ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయిన బీజేపీ ఈసారి విజయ బాహుటా ఎగరవేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీలో శ్రేణుల బలం కొంత మేరకు పెరిగినా.. బలమైన నాయకుడు లేకపోవడం.. ఉన్న నాయకుల మధ్య సమన్వయ లోపంతో తలెత్తిన ఆధిపత్య పోరు ఆ పార్టీని బలహీనపరిచే అవకాశం ఉంది. నియోజకవర్గంలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ కనిపించే పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గ ఏర్పడిన నుండి త్రిముఖ పోరే కొనసాగుతోంది.

అధికార పార్టీకి ప్రత్యర్థులు

అధికార పార్టీకి ప్రత్యర్థులుగా కాంగ్రెస్ నుండి కవ్వంపల్లి దాదాపుగా ఖరారైనా.. బీజేపీ నుండి గడ్డం నాగారాజు, దరువు ఎల్లన్న, సొల్లు అజయ్ వర్మ టికెట్ ఆశిస్తున్నట్టు విని కిడి. ఏ పార్టీలతో పొత్తు కుదరనప్పుడు సీపీఐ నుండి మంత్రి వెంకటస్వామి సైతం ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నట్టు సీపీఐ వర్గాలు చెబుతున్నాయి. గతంలో బీఎస్పీ నుండి నిషాని రామచంద్రం నిలువగా ఈ సారి అదిష్టానం ఎవరికి అవకాశమిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాబోయే ఎన్నికల్లో అయా పార్టీల అదిష్టానం ఎవరికి అవకాశమిస్తుందో? ఎవరిని పక్కన పెడుతుందో? అయోమయ పరిస్థితి నెలకొనడం ఒక ఎత్తయితే ప్రజలు ఈసారి ఎమ్మెల్యేగా ఎవరికి అవకాశమిస్తారో అంతుచిక్కడం లేదు.

ప్రజల్లో భిన్నాభిప్రాయాలు


సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎమ్మెల్యేకు కలిసి వచ్చే అంశాలైనా అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న మరో ఇద్దరు అభ్యర్థులతో పాటు ఇతర పార్టీ అభ్యర్థులతో మేజారిటీ ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. పార్టీలోని అంతర్గత విభేదాలతో పాటు బెజ్జంకి మండలంలోని గూడెం గ్రామంలోని దళిత లబ్ధిదారులకు మూడెకరాల భూపంపిణీలో నిర్లక్ష్యం, గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుండి చొక్కరావుపల్లి వరకు మండల మీదుగా ప్రధాన రోడ్డును నిర్మించాలని మండలంలోని యువజన సంఘాల అధ్వర్యంలో గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై చేపట్టిన మహధర్నా, గన్నేరువరం మండలాభివృద్ధిలో ఎమ్మెల్యే అలసత్వం వహించారని బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదం, ఉద్యమకారులకు మొండిచెయ్యి చూపి తమకనుగుణంగా ఉండేవారికే ప్రాధాన్యత ఇవ్వడం, ప్రశ్నించే గొంతుకులపై అయా మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు అక్రమ కేసులు నమోదు చెయించడం వంటి అనూహ్య పరిణామాలు ఎమ్మెల్యేకు మైనస్‌గా మారాయి. ఎన్నికలు దగ్గరపడుతున్నా.. పార్టీలో అంతర్గత పోరు ఎలా ఉన్నా ప్రజల్లో పట్టుకోల్పోకుండా తొలిపొద్దు కార్యక్రమంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు వేకువజామునే వెళ్లి సంక్షేమ పథకాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే స్వయంగా అందజేయడం కొంతమేరకు ఊరట కలిగించే అంశం.

ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరిగిన ఆదరణ

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు ప్రజల్లో ఆదరణను పెంచింది. పెరిగిన అదరణను వినియోగించుకోవడంలో కవ్వంపల్లి విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఇటు ప్రజల్లోకి పూర్తి స్థాయిలో వెళ్లకపోవడం.. తలెత్తిన వర్గ విభేదాలను పరిష్కరించి శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మైనస్‌గా మారాయి.

విస్మరిస్తే తగిన మూల్యం

సంక్షేమ పథకాలు, సీఎం కేసీఆర్ చరిష్మాతో గట్టెక్కుతామని ఆశిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే, అధికార పార్టీ ఆశావహులు... ప్రజల్లో పెరిగిన ఆదరణతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మోదీ పథకాలపై ఆశలు పెట్టుకున్న బీజేపీ ఆశావహులు ప్రజలతో మమేకమై శ్రేణులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ మిగిలిన సమయంలో అంతర్గత సమస్యలకు చెక్ చెప్పాలని.. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.



సమాజంలో వెలుగులు నింపేది దీపావళి కవితా సంకలనం



నవ తెలంగాణ - సిద్దిపేట

సమాజ శ్రేయస్సు కోసం సాహిత్యం సాగుతుందని, సమాజానికి వెలుగునిచ్చే దీపావళి సకల జనులను హర్షింపజేస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. సిద్దిపేటలో శ్రీచరణ్ సాయిదాస్ ఆధ్వర్యంలో దీపావళి కవితా సంకలనం ఆదివారం రోజు ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కవి విభిన్నమైన ఆలోచనలతో రచనలు చేయడం సంతోషమన్నారు. సంకలనకర్త శ్రీచరణ్ సాయిదాస్ మాట్లాడుతూ దీపావళి వెలుగులు అందించినట్లుగానే సమాజంలో సకల జనులంతా శుభాలతో ఉండాలని, అందుకు కవితా రచనలు చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి కవితా సంకలనాన్ని చక్కని సమీక్షతో కవి గాయకులు వర్కోలు లక్ష్మయ్య అలరించారు. కార్యక్రమంలో బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, కవులు పిన్నింటి మహేంద్రారెడ్డి, కోణం పర్శరాములు, బస్వ రాజ్ కుమార్, యాడవరం చంద్రకాంత్, కేసుగారి రాములు, బెజగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని వడ్లూర్ గ్రామానికి చెందిన చెన్నాడి అరుణ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆదివారం మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేర్యాల సీఐకి సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి శౌర్య పతకానికి ఎంపిక కావడంతో మద్దూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, సర్పంచులు జనార్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జర్నలిస్టులు రాజ్ కుమార్, రవి, లక్ష్మారెడ్డి, మహేందర్ శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్దూరు, చేర్యాల ఎస్సైలు నారాయణ గౌడ్, భాస్కర్ రెడ్డి, ముస్త్యాల సర్పంచ్ పేడతల ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్కుక్‌లో గ్రామ దేవతలకు బోనాలు



నవతెలంగాణ-మర్కుక్

మండల మండల కేంద్రమైన మర్కుక్‌లో గ్రామదేవతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. భక్తులు ఆలయం వద్దకు డప్పు చప్పుళ్లతో బోనాలను ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మొర్సు ప్రశాంత్ రెడ్డి, మొర్సు నరసింహారెడ్డి, మొర్సు చంద్రశేఖర్ రెడ్డి,విభిషన్ రెడ్డి లు సర్పంచ్ అచ్చంగారి భాస్కర్,రైతు బంధు సమితి అధ్యక్షులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసి చైతన్య శంకర్ రెడ్డి, అత్మ కమిటి డైరెక్టర్ యావగారి సంతోష్ రెడ్డి, నాయకులు మొర్సు శంకర్ రెడ్డి, విభిషన్ రెడ్డి, తదితరులున్నారు.

ముదిరాజ్ భవనం పనుల పరిశీలన



నవ తెలంగాణ- దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ముదిరాజ్ సంఘ భవన నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి ఆదివారం పరిశీలించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక సహకారంతో తమ వార్డును అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా పలు కుల సంఘాల భవన నిర్మాణాలు, మురికి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్మాజీపేట వార్డు అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, జిల్లా మంత్రి హరీష్ రావు,ఎంపీ ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బిఆర్ఎస్ బీసీ అధ్యక్షులు లోకని నర్సింలు, లోకని మల్లేశం,బత్తుల లక్ష్మణ్, మున్సిపల్ వర్క్ ఇన్ స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవ తెలంగాణ కొమురవెల్లి

విద్యుత్ సరఫరాకు సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏ ఈ కనకయ్య ఆదివారం ప్రకటన విడుదల చేశారు. నాగపురి నూతన సబ్ స్టేషన్ కు లైన్ల మరమ్మతులు చేపడుతున్నామని రైతులు గమనించాలని కోరారు

గురుకులాల్లో సమస్యల సాధన కోసం నేడు దీక్ష



నవ తెలంగాణ- గజ్వేల్

తెలంగాణలోని గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల సాధనకై ఈ నెల 17న జరిగే జిల్లా కేంద్రంలో జరిగే నిరసన దీక్ష, ఆగస్టు 5న రాష్ట్రస్థాయిలో తలపెట్టిన ధర్నాకు హాజరు కావాలని సమాయత్తం చేస్తూ ఆదివారం జిల్లాలోని గజ్వేల్, జగదేవపూర్, వర్గల్, ములుగు మండలాల్లోని వివిధ గురుకుల పాఠశాలాలను టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు షేక్ వలి అహ్మద్, జిల్లా కార్యదర్శి జి.వెంకట్ కిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలకు పోటీగా విద్యానందిస్తున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక వసతుల లేమితో ఉండగా బోధనా, బోధనేతర సిబ్బంది తమ విధుల నిర్వహణలో పలు సమస్యలు ఎదుర్కొంటూ మానసిక వత్తిడికి గురి అవుతున్నారని, పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదని కావున సమస్యల సాధనకు తలపెట్టిన పోరాటాల్లో పాల్గొని క విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పిఆర్సి కమిటీని నియమించాలని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలన్నారు.కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్ లను నియమించి ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీల నుండి మినహాయించాలని, ఆదివారం పండుగ రోజుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అన్ని సోసిటీలలో వీక్ ఆఫ్ వర్తింపజేయాలని, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, స్టాఫ్ నర్సు లకు ప్రమోషన్ చానల్ కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైమ్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే మరియు 12 నెలల జీతాలు ఇవ్వాలని,విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ఉత్తర్వులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి ఖబర్దార్



నవతెలంగాణ కొండపాక

తెలంగాణ రైతంగంపై విషయం చిమ్ముతూ మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పార్టీని బొంద పెట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లిలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటుకు నోటు దొంగ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగం మీద విషం చిమ్ముతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తామని చెప్పి అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి దానిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణ రైతాంగానికి కరెంటు ఇవ్వడంపై చేసిన వ్యాఖ్యలను నీ పార్టీ పెద్దలే నిన్ను వ్యతిరేకిస్తున్నారని అది గ్రహించడం లేదా అని ప్రశ్నించారు. గజ్వేల్‌లో కేసీఆర్ మళ్లీ పోటీ చేస్తారా అని అంటున్నావు కదా ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట, మెదక్, కరీంనగర్, మహబూబ్ నగర్ గజ్వేల్‌లో పోటీచేసి గెలిసింది నీకు తెలవదా అని అన్నారు. కొడంగల్ ప్రజలు తంతే వచ్చి సికింద్రాబాద్‌లో పడ్డ నీవు కాంగ్రెస్ పార్టీ అసలు నీకు టికెట్ ఇస్తుందో లేదో తెలియదు కానీ కెసిఆర్ గురించి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రైతాంగం కోసం అనునిత్యం పనిచేస్తూ తెలంగాణ రైతులు గల్లా ఎగరేసుకొని నేను రైతు బిడ్డను అని చెప్పుకునే విధంగా చేయాలన్న లక్ష్యంతో అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నీ వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగంపై నువ్వు చేసిన వ్యాఖ్యలు రైతులు మర్చిపోరని, నిన్ను, నీ పార్టీని రాజకీయంగా బొంద పెట్టడం ఖాయమన్నారు. మంత్రి హరీష్ రావు కొడంగల్‌కు వచ్చి నిన్ను చిత్తుగా ఓడ గొట్టిన విషయం మర్చిపోయావా, మతిభ్రమించిన మాటలు మానుకోమని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచులు బచ్చలి మైపాల్ , మల్లమారి రవీందర్, బిఆర్ఎస్ నాయకులు కంకణాల మల్లేశం, దేవి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ శంకుస్థాపన



నవతెలంగాణ- చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని నాగపురి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సుమారు రూ.3 లక్షల వ్యయంతో అంతర్గత మురికి కాలువల నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ బండమీది సంతోషి-కరుణాకర్ తో కలిసి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లేశం, ఏఎంసీ డైరెక్టర్ భీమ రాజు,వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల పార్టీల తీరు విడ్డూరంగా ఉంది



రాష్ట్ర యూత్ వింగ్ ఉపాధ్యక్షులు జుబేర్ పాషా

నవ తెలంగాణ ములుగు

తెలంగాణ రైతాంగానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీ వ్యవహరిస్తున్న తీరు విడ్డూరంగా ఉందని రాష్ట్ర యూత్ వింగ్ ఉపాధ్యక్షులు జుబేర్ పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రం ములుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అడుగడుగునా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనే రోల్ మోడల్ గా తయారు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న పనులను చూసి జీర్ణించుకోలేక కాంగ్రెస్ బిజెపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారత్యంలో రైతులు అప్పుల ఊబి నుండి ఇప్పుడు ఇప్పుడే ఆర్థికంగా కోరుకుంటున్నారని ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పడం చాలా దారుణం అన్నారు. రైతుల గోస కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలియదన్నారు. రైతులను నడ్డి విడిచే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పడం, బిజెపి పార్టీ మోటార్లకు మీటర్లు పెడతామని చెప్పడం రైతుల నోట్ల మట్టి కొట్టే విధంగా ప్రతిపక్షాల తీరుతుందని విమర్శించారు. రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులకు యూరియా దొరకక డిఏపీలు దొరకక విత్తనాలు దొరకక కరెంటు లేక పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు చాలా ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకున్న గత కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉండేదన్నారు

నిర్వాసితుల త్యాగాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్



మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ-తొగుట

పది మందికి మేలు చేయడం కోసం పంట పొలాల ను త్యాగం చేసిన మీ త్యాగాలు మరువలేమని మెదక్ ఎంపీ,సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. 2వ టీఎంసీ ఓపెన్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న బండారు పల్లి, ఘనపుర్ రైతులకు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి రూ.5 లక్షల పరిహారం చెక్కులు శనివారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ ఆధ్వర్యం లో స్వయం సమృద్ధి సాధించిందన్నారు.కరువు కాలంలో సాగునీళ్లు అందిస్తున్న కాళేశ్వరం ప్రాజె క్టుల మీద ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయ దం వారి విజ్ఞతకే వదిలేశామని తెలిపారు.కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగా ణ రాష్ట్రంపై వివక్ష చూపిస్తుందని ఆరోపించారు. తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకైన జాతీయ హోదా ఇచ్చారా అని ప్రశ్నించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తీసుకు రావడంలో ఇక్కడి బీజేపీ ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని ఎద్దే వా చేశారు.కెనాల్ నిర్మాణం లో భూములు కోల్పో యిన నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం ఎకరా కు రూ.8 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించిందని గుర్తు చేశారు. అదనపు పరిహారం కోర్టు ద్వారా రావాల్సి ఉండగా ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులకు అనుకూలంగా వ్యవహరిం చిందని కొనియాడారు.రూ.5 లక్షల పరిహారం కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులకు సహకా రం అందించిందని ధీమా వ్యక్తం చేశారు.కాలువ బాధితులకు అన్ని విధాలుగా సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్ రావులకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఈఈ సాయిబాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య,వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,సర్పంచ్ లు సిరినేని గోవర్ధన్ రెడ్డి,కుంభం శారదా రఘోతంరెడ్డి,కుంభా ల వెంకటమ్మ,ఎంపీటీసీలు వేల్పుల స్వామి,కొమ్ము శరత్,మాష్టి సుమలత కనకయ్య,కో ఆప్షన్ సభ్యు లు ఎండీ కలీమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రచయితల వేదిక జీవనది లాంటిది



తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి

నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రచయితల వేదిక జీవనది లాంటిదని, ఎప్పుడు సజీవంగా ప్రవహిస్తూనే ఉంటుందని తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జీవద్భాషను, కళలు, సంస్కృతిని, బావితరాలకు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. ఉద్యమకాలం నుండి నేటి వరకు మడమ తిప్పకుండా, తొవ్వ తప్పకుండా, ప్రజాపక్షం వహించి యావత్ తెలంగాణ ఆదరభిమానాలను చురగొన్నదన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లా శాఖలను పునర్నిర్మించి త్వరలోనే హైదరాబాదులో పెద్ద ఎత్తున పునర్వైభవ సభ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెరవే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోకరాజు ఎన్నికల అధికారిగా ఆయన అధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా మహమూద్ పాషా, ఉపాధ్యక్షులుగా పిల్లి మహెందర్, తాటి కిషన్, ఎలికట్టె అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి మహిపాల్, కార్యదర్శులుగా జాలిగామ భానుప్రసాద్ గౌడ్, పిడిశెట్టి రాజు, గోత్రాల సంతోష్, కోశాధికారిగా మోర మోహన్, కార్యవర్గ సభ్యులుగా కొండపర్తి భాస్కరాచారి, అంకూర ఉమాశంకర్, మూటకోడూరు సిద్ధయ్య, గౌరవసలహాదారుగా వంగర నరసింహారెడ్డి ఎన్నికయ్యారు.

పొదుపు చేయటం అలవర్చుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

నెలలో కనీసం ఒక రోజు సంపాదనను పొదుపు చేయటం వలన ఆపదలో ఇతరులపై ఆధారపడకుండా ఉండకలుగుతామని పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు కదారి తిరుపతి రెడ్డి అన్నారు. నంగునూరు పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన వల్లపురెడ్డి చింతల లక్ష్మారెడ్డి ఇటీవలే మరణించాడు. అతనికి సంఘం తరపున మంజూరైన సామూహిక నిధి, బీమా క్లైం, అభయ నిధిపత్సాహాయం రూ.40 వేలు నగదును నామినీ వినోదకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఒక క్రమం పద్ధతిలో నియమిత పొదుపు చేసుకునే అవకాశాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పురుషుల సంఘంలో సభ్యుడిగా నమోదైన వారు సామూహిక బీమా నిధి పథకంలో చేరితే ఎలాంటి మరణం సంభవించిన నామినీకి 25వేల నగదును సహవికాస సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు గోపాల్, పాలక వర్గసభ్యులు రాగుల మల్లేశం,దేవులపల్లి ఐలయ్య, గోనె సత్యనారాయణ, పిట్టల కనకయ్య,వల్లపురెడ్డి రాంచంద్రారెడ్డి, గణకుడు కోల రాజశేఖర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి



నవ తెలంగాణ - దౌల్తాబాద్

అనారోగ్యంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇంద్రుప్రియల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. సర్పంచ్ సూరంపల్లి శ్యామల కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాసుల బాద్ శ్యామల అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున మేడ్చల్ పట్టణంలో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు గత కొంతకాలంగా మేడ్చల్ పట్టణంలోని కూలి పనులు చేసుకుంటూ జీవితాన్ని కొనసాగించేవారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. మృతురాలకు ముగ్గురు ఆడపిల్లలు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో గ్రామ యువకులు, ప్రజల చందాల సహకారంతో అంతక్రియలు నిర్వహించారు. మనసున్న మహారాజులు ఆ కుటుంబానికి 9515351432కు ఆర్థిక సాయాన్ని అందించాలని కోరుతున్నారు.

పెందోట బాల సాహిత్య పురస్కారాలకు ఎంపికైన పుస్తకాలు

నవ తెలంగాణ - సిద్దిపేట: పెందోట బాల సాహిత్య పురస్కారాలకు 2022 సంవత్సరంలో ప్రచురించిన బాల సాహిత్య పుస్తకాలు ఎంపిక చేసినట్లు పెందోట బాలసాహిత్య పీఠం అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన ఆధునిక పంచ్ తంత్ర కథలు - శైలజా మిత్ర, నాయనమ్మ కథలు - దారం గంగాధర్ , కాశీ మామయ్య కథలు - పత్రాయుడు కాశీ విశ్వనాథం, నిజమైన స్నేహితులు- కుమారి వేల్పుల శ్రీలత రాసిన రచనలు ఎంపిక అయ్యాయని, బాల సాహిత్య విశిష్ట పురస్కారాలకు నారుమడిబీ చుక్ చల్ గుర్రంబీ చిర్రగోనె ప్రచురించిన బాల సాహిత్య సేవకులు వాసరవేణి పరుశురాం, వేచరేణి వెలుగులు-ఎన్నో సంకలనాలకు బాల సాహిత్య సంపాదకుడు, బాల సాహిత్య సేవకులు మంగళంపల్లి రామచంద్రమూర్తి, బాలగేయాలకు చిచ్చర పిడుగు-డాక్టర్ బి సుధాకర్, బాల కవిత్వాలకు కాలుతున్న వెన్నెల శిల్పి - చంద్రశేఖర్ లు పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తిరుమలాపూర్‌లో రాయటమ్మ జాతర



నవ తెలంగాణ దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో సోమవారం రాయటమ్మ జాతర నిర్వహించనున్నట్లు సర్పంచ్ గడప మీద భాగ్య తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాయటమ్మ మనకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాయడమ్మ జాతర కోసం హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో వలస వెళ్లిన ప్రజలు స్వగ్రామానికి వచ్చి అమ్మవారి సేవలో పాల్గొని మొక్కలను తీర్చుకోవడం జరుగుతుందని తెలిపారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన మోటార్ సైకిల్

ముగ్గురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ కొండపాక

కుకునూరుపల్లి శివారులో మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల నుంచి హైద్రాబాద్‌కు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు మోటార్ సైకిల్ పై వెళ్తున్న క్రమంలో కుకునూర్ పల్లి పోలీస్ స్టేషన్ దాటాక బ్రిడ్జి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న ఎస్.సాయి(25), మిద్దె రఘు(26), వెంకటేష్(27)లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వారికి ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ఆసుపత్రిలో చేర్పించారు. గాయపడిన వారిలో సాయి, రఘు ల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు మేలు



నవతెలంగాణ-మర్కుక్

సీఎం సహాయ నిధితో పేద ప్రజల ఎంతో మేలు జరుగుతుందని మర్కుక్ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు అప్పాల ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వరదరాజ్ పూర్ గ్రామానికి చెందిన ఆర్.మల్లయ్యకు సిఎం సహాయ నిధి రూ.56 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నగేష్, అశోక్, నర్సింలు, నాయకులు ఎల్లం, రాజు, అమర్, రమేష్, తదితరులున్నారు.

ఉప్పరపల్లిలో ముత్యాలమ్మ బోనాలు



నవ తెలంగాణ- దౌల్తాబాద్

ఆషాడ మాసం పురస్కరించు కొని మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాలను ప్రతి ఏటా మాధురి గానే ఈ సంవత్సరం కూడా బోనాలను ఘనంగా నిర్వహించామని సర్పంచ్ కలలి చిత్తారిగౌడ్ అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో నిర్వహించే మాదిరిగానే మా గ్రామంలో బోనాల పండుగను జరుపుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం బీఎస్పీ ద్వారానే సాధ్యం



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీఎస్పీ పార్టీ గెలిస్తేనే సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు 50 సీట్లు ఇచ్చేది బహుజన్ సమాజ్ పార్టీనే నని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జి ఎనగందుల శంకర్, అధ్యక్షులు వేల్పుల రాజు, మహిళ జిల్లా కన్వీనర్ పులి నీరజ, అసెంబ్లీ మహిళ కన్వీనర్ పందిపల్లి రమాదేవి, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.